క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



ఆత్మకూరు: నెల్లూరులోని నివాసంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని ఆత్మకూరు పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆత్మకూరులో పార్టీ పరిస్థితి, మున్సిపల్ బస్టాండ్ నిర్మాణం, తదితర విషయాలపై చర్చించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జీ వెంకట రమణమ్మ, పార్టీ నాయకులు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, టీ వెంకటేశ్వర్లు, పెమ్మసాని శ్రీనివాసులునాయుడు, కౌన్సిలర్లు పీ పెంచలయ్య, నలిశెట్టి శీనయ్య, చిల్లూరు వెంకటేశ్వర్లు, నవీన్, మహేంద్ర, దిలీప్, ఖాజావలి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు



ఆత్మకూరురూరల్: కోటపాడులో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో జరుగుతున్న నూతన సీతారామలక్ష్మణ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. బద్వేల్‌కు చెందిన ప్రతిష్టాచార్యులు ఐలావజ్ఝల రామకృష్ణశాస్త్రి, నాగరాజశర్మ, శివకుమార్‌శాస్త్రి, ఆలయ అర్చకుడు పేట హజరత్తయ్య ఆధ్వర్యంలో మూడ్రోజుల పాటు విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. చివరి రోజు నూతన విగ్రహాలను శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. స్థానిక నాయకులు సూరం రాజశేఖర్ రెడ్డి, గంధం శ్రీకాంత్, శివబ్రహ్మారెడ్డి, తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పొట్టేళ్ల అపహరణపై ఫిర్యాదు

ఆత్మకూరు: గొర్రెల దొడ్డిలోని మూడు పొట్టేళ్ల అపహరణపై జీవాల పెంపకందారుడు వైద్యుల సుధీర్ ఆత్మకూరు పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. వివరాలు..ఆరవేడు గ్రామానికి చెందిన సుధీర్ గొర్రెలు మేపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. రెండ్రోజుల క్రితం రోజూలాగే పొలం నుంచి తిరిగి వచ్చిన గొర్రెలను సాయంత్రం దొడ్డిలో తోలాడు. ఉదయం లేచి చూడగా మూడు పొట్టేళ్లు కనిపించలేదు. చుట్టుపక్కల విచారించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై సాయి ప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తెల్లపాడులో నిలిచిన నవమి ఉత్సవాలు

కలిగిరి: తెల్లపాడులోని కోదండరామస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి ఉత్సవాలు నిలిచిపోయాయి. ఏటా శ్రీరామనవమి సందర్భంగా ఏడు రోజుల పాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది ఆలయ ధర్మకర్త మారేళ్ల వెంకటశేషారెడ్డి, పలువురు ఉభయకర్తల నడుమ నెలకొన్న వివాదాల నేపథ్యంలో ఉత్సవాలను నిలిపివేయడం చర్చనీయాంశమైంది. శుక్రవారం సీతారాముల కల్యాణాన్ని నిర్వహించడానికి ఆలయ ధర్మకర్త వెంకటశేషారెడ్డి వర్గీయులు, ఉభయకర్తలు సన్నాహాలు చేస్తుండగా, వ్యతిరేక వర్గీయులు నిలిపివేయాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ వివాదం పోలీస్‌స్టేషన్‌కు చేరడంతో ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి ఇరువర్గాలతో చర్చలు జరిపారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా సహకరించాలని కోరారు. ఇరువర్గాలు ఏకాభిప్రాయానికి రాకపోవడంతో శుక్రవారం నిర్వహించ తలపెట్టిన సీతారాముల కల్యాణోత్సవాన్ని తాత్కాలికంగా వాయిదా వేశారు.

బైక్ చోరీ

నెల్లూరు సిటీ: బైక్ చోరీకి గురైన ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. బీవీనగర్‌కు చెందిన మిథున్‌బాబు గూడూరులోని పంచాయతీ రాజ్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. రోజూ తన బైక్‌పై వేదాయపాళెం రైల్వేస్టేషన్‌కు వచ్చి అక్కడే బైక్‌ను నిలిపేవారు. ఈ క్రమంలో ఫిబ్రవరి తొమ్మిదిన బైక్‌ను అక్కడ పార్క్ చేసి విధులకెళ్లారు. అనంతరం తిరిగొచ్చేసరికి బైక్ మాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సంగీత, సాహిత్య సమ్మేళనం

నెల్లూరు(బృందావనం): మినీబైపాస్ రోడ్డులో నిన్నర్సరీలో సంగీత, సాహిత్య సమ్మేళనాన్ని గోవిందరాజు సీతాదేవి సాహితీ వేదిక అధ్యక్షురాలు సుభద్రాదేవి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. శ్రీరామనవమిని పురస్కరించుకొని పూజా కార్యక్రమాలను చేపట్టారు. రామ దాసు, త్యాగరాజ కీర్తనలు, రామచంద్రమూర్తిపై భక్తిగీతాలను ఆలపించారు. హాజరైన వారిని సత్కరించి పూల మొక్కలను అందజేశారు.

వైభవంగా శ్రీరామ నవమి వేడుకలు



సంగంలో కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు



సంగంలో సీతారాముల కల్యాణోత్సవం

ఆత్మకూరు: శ్రీరామ నవమి వేడుకలను వాడవాడలా బుధవారం వైభవంగా నిర్వహించారు. రామాలయాల్లో విశేష పూజలు, సీతారాముల కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. పట్టణంలోని సుందరమ్మ కోదండ రామాలయంలో సీతారాముల ఎదురుకోలు వేడుక, కల్యాణోత్సవాన్ని కనులపండవగా నిర్వహించారు. మధ్యాహ్నం భారీస్థాయిలో అన్నప్రసాద వితరణ చేశారు. పంటవీధిలోని రామాలయంలో అర్చకులు నాగరాజశర్మ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం గజ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. నాగేంద్రపురంలోని సీతారాముల ఆలయంలో కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారీస్థాయిలో అన్నదానం చేశారు.

ఆత్మకూరురూరల్: మండల ప్రజలు శ్రీరామనవమి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. రామాలయాల్లో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. గండ్లవీడు, రామస్వామిపల్లి, నాగులపాడు, తదితర గ్రామాల్లో సీతారామలక్ష్మణుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి గరుడ, అశ్వ వాహనాలపై కొలువుదీర్చి గ్రామోత్సవం జరిపారు. గండ్లవీడులో ఉత్తరపువీధికి చెందిన వారు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

చేజర్ల: మండల ప్రజలు శ్రీరామ నవమిని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. చేజర్ల, యనమదల, నాగులవెలటూరు, పెరుమాళ్లపాడు, ఆదూరుపల్లి, తూర్పుపల్లి, పాడేరు, మాముడూరు గ్రామాల్లోని రామాలయాల్లో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఐదురోజుల పాటు శ్రీరామ నవమి ఉత్సవాల నిర్వహణకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా నాగులవెలటూరులో 31న హనుమంతసేవ, 1న గరుడసేవ, అన్నదానం, 2న సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ పోలిశెట్టి రమణయ్య గుప్త తెలిపారు.

మర్రిపాడు: మండలంలో శ్రీరామనవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. రామాలయాల్లో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం సీతారాముల కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

సోమశిల: శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని అనంతసాగరం మండలం వరికుంటపాడు, సోమశిల గ్రామాల్లోని రామమందిరాల్లో విశేష పూజలు, సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వరికుంటపాడులో జెడ్పీటీసీ సభ్యుడు రాపూరు వెంకటసుబ్బారెడ్డి కుటుంబసభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. సోమశిలలోని రామాలయంలో అర్చకుడు చంద్రమౌళిశర్మ ఆధ్వర్యంలో కల్యాణాన్ని వేడుకగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. వైఎస్ ఎంపీపీ అల్లంపాటి సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ రాపూరు ఇంద్రావతమ్మ, జేసీఎస్ కోఆర్డినేటర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంగం: మండలంలో శ్రీరామనవమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. సంగంలోని అభయాంజనేయస్వామి ఆలయం, జంగాలదొరువులోని రామమందిరాల్లో సీతారాముల కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులు సీతారాముల కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అనుమసముద్రంపేట: మండలంలో శ్రీరామనవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. శ్రీకొలను, దూబగుంట, పానుగోడు, రాజవోలు, తదితర గ్రామాల్లోని రామాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. సీతారాముల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం

జలదంకి: మండలంలోని వాడవాడలా శ్రీరామనవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. కమ్మవారిపాళెం, బ్రాహ్మణక్రాకలోని కోదండరామస్వామి ఆలయాల్లో సీతారాములు కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, విశేషాభిషేకాలు, స్నపన తిరుమంజనం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం 11 గంటలకు సీతారాములను పట్టువస్త్ర, సుగంధభరిత పుష్పమాలికలు, విశేషాభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చారు. అనంతరం భక్తుల రామనామస్మరణ, వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని అత్యంత కమనీయంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం సీతారాముల గ్రామోత్సవం నిర్వహించారు. కమ్మవారిపాళెంలో వింజం బసవనాయుడు కుమారులు చెంచుకృష్ణమోహన్, రమేష్‌చంద్ర, విష్ణు చైతన్య, సుధాకర్, శ్రీనివాస్, మహేష్ ఉభయకర్తలుగా వ్యవహరించారు. బ్రాహ్మణక్రాకలో వేలమూరి నరోత్తమరెడ్డి ఉభయకర్తగా వ్యవహరించారు.

కలిగిరి: మండలంలోని వాడవాడలా శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రామాలయాల్లో విశేష పూజలు, సీతారాముల కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

కొండాపురం: మండల ప్రజలు శ్రీరామనవమి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. కొమ్మి, లింగన్నపాలెం, కొండాపురం, మర్రిగుంట, తూర్పుఎర్రబల్లి, రేణమాల, తదితర గ్రామాల్లోని రామమందిరాల్లో విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం సీతారాముల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

వింజమూరు: మండలంలోని వాడవాడలా శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కోదండరామస్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులకు వడపప్పు, పానకం పంచిపెట్టారు.

అశ్వ వాహనంపై గ్రామోత్సవం

శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా గుండెమడకల, శంఖవరం గ్రామాల్లో అశ్వ వాహనంపై సీతాలక్ష్మణ సమేత శ్రీరామచంద్రుడ్ని కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గుండెమడకలలో శేషవాహన సేవ, శంఖవరంలో హనుమంతుసేవ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కావలి రూరల్: పట్టణం, రూరల్ ప్రజలు శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. పట్టణంలోని వెంగళరావునగర్, జనతాపేట, ఐదులాంతర్ల సెంటర్, ట్రంకురోడ్డులోని ఉత్తరంపేట, దక్షిణంపేట రామాలయాల్లో శ్రీరామనవమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులకు వడపప్పు, పానకం ప్రసాదాన్ని పంపిణీ చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.



ఆత్మకూరురూరల్: గండ్లవీడులో గరుడ వాహనోత్సవం



జలదంకి: కమ్మవారిపాలెంలో సీతారాముల కల్యాణోత్సవం



మర్రిపాడు: ఆంజనేయస్వామి ఆలయంలో..



సోమశిల: వరికుంటపాడులో సీతారాముల కల్యాణం



కావలిరూరల్: జనతాపేటలో సీతారాముల కల్యాణం



కొండాపురంలో అన్నదానం



ఆత్మకూరు: కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవం



కలిగిరి: కృష్ణారెడ్డిపాలెంలో సీతారాముల కల్యాణం

వైభవంగా గంధ మహోత్సవం



అల్లూరులో సాయిబాబా పల్లకిసేవ

కావలి : శ్రీరామ నవమి సందర్భంగా పట్టణంలో సాయిబాబా గంధ మహోత్సవాన్ని గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. తొలుత బాబాను చందనంతో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం సాయిబాబా విగ్రహాన్ని విశేషంగా అలంకరించి గంధంతో పాటు ఊరేగించారు. హిందూ, ముస్లింలు పాల్గొని ఐక్యతను చాటారు. సహజకవి వీరకృష్ణ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. గంధోత్సవంలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అల్లూరు: శ్రీరామ నవమి సందర్భంగా అల్లూరుపేటలో షిర్డీ సాయిబాబా చావడి గంధ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. సాయిబాబా చిత్రపటాన్ని విశేషంగా అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. మసీద్‌సెంటర్‌లోని దర్గా, కోనేటిమిట్టలోని దాదాదాదీ దర్గా వద్ద హిందూ, ముస్లింలు కులమతాలకు అతీతంగా గంధానికి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



కావలిలో సాయిబాబా గంధోత్సవ ఊరేగింపు

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

చేజర్ల: నెల్లూరు నుంచి సంగం, మాముడూరు, ఓబులాయపల్లి మీదుగా చేజర్లకు బస్సు సౌకర్యం కల్పించాలని ఎంపీపీ బాలిరెడ్డి రమాదేవి ఆర్టీసీ అధికారులను గురువారం ఒక ప్రకటనలో కోరారు. గతంలో ఈ మార్గంలో నాలుగు బస్సులు తిరిగేవని, వాటిని రద్దు చేయడంతో ప్రయాణికులతో పాటు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెన్నాపై బ్యారేజ్ నిర్మాణంతో సంగం నుంచి చేజర్లకు బస్సుల రాకపోకలకు అనుకూలంగా ఉందన్నారు. పదో తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి బస్సు సర్వీసులు నడపాలని కోరారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

బిట్రగుంట: బోగోలు మండలం కప్పరాళ్లతిప్ప సమీపంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గురువారం కారు అదుపుతప్పి హైవే ఫ్లైఓవర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు, ప్రత్యక్షసాక్షుల వివరాల మేరకు.. కాణిపాకం నుంచి ఒంగోలు వెళుతున్న కారు ఫ్లైఓవర్‌పై ప్రమాదవశాత్తు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. డ్రైవర్ చాకచక్యంగా కారును అదుపు చేయడంతో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. కారులోని ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. కాగా ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని బిట్రగుంట పోలీసులు తెలిపారు.

నేడు మున్సిపల్ బడ్జెట్ సమావేశం

ఆత్మకూరు: మున్సిపల్ బడ్జెట్ సమావేశాన్ని శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎం రమేష్‌బాబు గురువారం తెలిపారు. మున్సిపల్ సమావేశ మందిరంలో అభివృద్ధి పనులు, బడ్జెట్ కేటాయింపులు, తదితర అంశాలపై సమావేశం జరుగుతుందని చెప్పారు. అనంతరం 12 గంటలకు ఎంజీఆర్ సమావేశ మందిరంలో మున్సిపల్ అత్యవసర సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు ధర్మకర్తల మండలి సమావేశం

వింజమూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన నల్లగొండ్ల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పాలకమండలి సమావేశాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఈఓ మల్లికార్జున్‌రెడ్డి గురువారం తెలిపారు. ఆలయ ధర్మకర్త అన్నపురెడ్డి మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలతో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. పాలక మండలి సభ్యులు, గ్రామపెద్దలు, ఉభయకర్తలు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

గడప గడపకు సంక్షేమ ఫలాలు

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

చేజర్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని అన్ని వర్గాల్లోని పేదల అభివృద్ధికి సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పారదర్శకంగా గడప గడపకు సంక్షేమ ఫలాలను చేరవేస్తున్నారని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఆదూరుపల్లి సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. ఎస్సీ కాలనీవాసులు సీసీరోడ్డు నిర్మించాలని ఎమ్మెల్యేను కోరగా, ప్రతిపాదనలు సిద్ధం చేయించి త్వరలోనే రోడ్డు నిర్మాణం చేపడుతామని హామీ ఇచ్చారు. కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించారు. జగనన్న కాలనీలోని గృహలబ్ధిదారులు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరగా, విద్యుత్ అధికారులతో మాట్లాడి ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. గ్రామానికి చెందిన కరిముల్లా లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నానని, తనకు సర్టిఫికెట్ మంజూరు చేయించి పెన్షన్ ఇప్పించాలని కోరగా ఎమ్మెల్యే స్పందించారు. వెంటనే జిల్లా వైద్యారోగ్య శాఖాధికారితో ఫోన్‌లో మాట్లాడి హెల్త్ సర్టిఫికెట్ మంజూరు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అన్నింటిని నెరవేరుస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో మోసపోయిన పొదుపు మహిళలకు ఇచ్చిన హామీ మేరకు వైఎస్సార్ ఆసరాతో ఆర్థిక భరోసా కల్పిస్తున్నారన్నారు. ఇప్పటి వరకు మూడు విడతలుగా నగదు జమ చేశారని తెలిపారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ఏప్రిల్ 11న ఆత్మకూరులో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ సమస్యలను తహసీల్దార్ల దృష్టికి ప్రజాప్రతినిధుల ద్వారా తీసుకురావాలని కోరారు. జెడ్పీటీసీ పీర్ల పార్థసారథి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తూమాటి విజయ భాస్కర్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు బీ వీరరాఘవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తూమాటి వంశీకృష్ణారెడ్డి, అట్రాసిటీ కమిటీ మెంబర్ ఎర్రగుంట పెంచలయ్య, ఎంపీడీఓ విజయలలిత, ఏపీఎం చీర్ల సుజన, డీటీ విజయ్, నాయకులు బీ మాలకొండారెడ్డి, పీ చంద్రశేఖర్‌రెడ్డి, రఘురామిరెడ్డి, శేఖర్‌రెడ్డి, చీర్ల రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ముస్లింల సన్మానం

గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఆదూరుపల్లికి వచ్చిన ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని ముస్లింలు ఘనంగా సన్మానించారు. సాయంత్రం ఉపవాసదీక్షల అనంతరం మైనార్టీ కమిటీ అధ్యక్షుడు షేక్ బషీర్ స్వగృహంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లింల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పీర్ల పార్థసారథి, షేక్ మహమ్మద్ రఫీ, మౌలానా మహబూబ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సత్కరించి ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు

ఆత్మకూరు: నియోజకవర్గంలోని రెవెన్యూ సమస్యలైన భూ పంపిణీ, చుక్కలు, సాదాబైనామా, ఇనాం భూములు, పాసుపుస్తకాల మంజూరు, తదితర సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి చర్యలు చేపట్టారు. ఏప్రిల్ 11న ఆత్మకూరులోని మున్సిపల్ సమావేశ మందిరంలో రెవెన్యూ సమస్యలపై ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నారు. అందుకు సంబంధించి రెవెన్యూ సమస్యల బాధితులు ఏప్రిల్ 2లోగా మండల తహసీల్దార్ కార్యాలయాల్లో అర్జీలు అందజేయాలని ఎమ్మెల్యే కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే సమీక్ష సమావేశంలో అర్జీలపై సమీక్షించి రెవెన్యూ సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు.

రైతు సంక్షేమానికి సొసైటీ కృషి

కోవూరు: పడుగుపాడు సొసైటీని ప్రారంభించి దాదాపు 102 ఏళ్లు పూర్తయిందని, రైతుల సంక్షేమానికి నిరంతరం సొసైటీ కృషి చేస్తోందని ఆ సొసైటీ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి తెలిపారు. కోవూరులోని సొసైటీ కార్యాలయంలో గురువారం మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ పరిధిలో ఉన్న పది గ్రామాల్లోని రైతులకు అవసరమైన అన్ని రుణాలను తక్కువ వడ్డీకే అందజేస్తున్నామన్నారు. సొసైటీ పరిధిలోని కోవూరు, చెర్లోపాళెం వేగూరు, కోవూరు, పోతిరెడ్డిపాళెం, పాటూరు గ్రామాల్లో ధాన్యం నిల్వ చేసుకునేందుకు గోదాముల నిర్మాణం చేపడుతున్నామన్నారు. సొసైటీలో లాకర్ సదుపాయం కలదన్నారు. ఇనమడుగు గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో పెట్రోలు బంకు నిర్మిస్తున్నట్లు తెలిపారు. అనంతరం డీఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, సొసైటీ సీఈఓ గోవర్ధన్‌రెడ్డి మాట్లాడారు.అనంతరం రక్తదానశిబిరం నిర్వహించారు. 75సార్లు రక్తదానం చేసిన దేవిరెడ్డి సురేష్‌రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కమిటీ సభ్యులు గునపాటి ప్రసాద్‌రెడ్డి, సొసైటీ రాఘవయ్య, బ్యాంకు మేనేజర్ సుధాకర్, డైరెక్టర్లు అంబటి ప్రసాద్, గున్నం జనార్దన్, మండల ఉపాధ్యక్షుడు శివుని నరసింహులురెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నలుబోలు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం